క్లుప్తంగా

వాడనర్సాపురంలో గడపగడపకు.. నేడు

రాంబిల్లి: వాడనర్సాపురం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీపీ జి.శిరీష్‌శ్రీనుబాబు కోరారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ



పేపర్ క్రాఫ్ట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ప్రతిరోజూ ఈ శిబిరానికి హాజరవుతున్నారు. ఆదివారం లైబ్రేరియన్ ఎస్. శకుంతల, రీసోర్స్ పర్సన్ సీహెచ్ జగదీష్ పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల కోసం కార్టూన్ సినిమాను ప్రదర్శించారు. చదవడం, రాయడంపై అవగాహన కల్పించారు.

మురుగుతో అవస్థలు



దిమిలిలో రోడ్డుపైకి చేరుతున్న మురుగునీరు

రాంబిల్లి : మండలంలో దిమిలి గ్రామంలో పలు వీధుల్లో మురుగుకాలువల వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాడుక నీరు పోయేందుకు మార్గం లేక మురుగు రోడ్లపై పారుతోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. మురుగు నిల్వ చేరి ఉండడంతో అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : మునగపాకలో పలు చోట్ల ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండుగలు ఘనంగా జరిగాయి. మునగపాక బీసీ కాలనీ, మూలపేటకు వెళ్లే దారిలోని తంపరమూల ప్రాంతాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, తంపరమూల రైతు సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల మణికంఠ అమ్మవారిని దర్శించుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం : విద్యాభ్యాసం నాటి ఆనంద క్షణాలు గుర్తుకు తెచ్చుకుని వయస్సు పైబడినా అప్పటి నిక్ నేమ్‌లతో పిలుచుకుని పూర్వ విద్యార్థులు సందడి చేశారు. పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్ 18 ఏళ్ల తరువాత తొలిసారిగా కలుసుకున్న పూర్వ విద్యార్థులకు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కుటుంబ సమేతంగా హాజరైన విద్యార్థులకు వారి పిల్లలే కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం గ్రూప్ ఫోటోలు, సెల్ఫీలు దిగి భద్ర పరచుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్రం వరకు పాఠశాలలో సరదాగా గడిపారు.

పొదుగు వాపు వ్యాధితో జాగ్రత్త



కోటవురట్ల : అన్నదాతకు రెండో కన్నులా ఆసరాగా ఉన్న పాడి పశువుల సంరక్షణలో తగు జాగ్రత్తలు అవసరం. ప్రధానంగా పశువుల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులను గుర్తించడం, ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించడం, వ్యాధి సోకినపుడు పశువైద్యులను సంప్రదించడం వంటి అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పశువుల్లో వచ్చే అనేక వ్యాధుల్లో ఒకటైన పొదుగు వాపు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ ఏడీ సింహాద్రప్పుడు సూచిస్తున్నారు. సంరక్షణ, వ్యాధులు, చికిత్స గురించి ఆయన వివరించారు. పొదుగు వాపు వ్యాధి పాల ఉత్పత్తి ఎక్కువగా ఉన్న పశువులు, సంకరజాతి పశువుల్లో ఎక్కువగా కనిపిస్తుందని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వ్యాధికి కాలం అంటూ ఏదీ లేదని, పాలిచ్చే పశువుల్లో ఏ సమయంలో అయినా వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

వ్యాధి సోకేది ఇలా..

పాలు పితికేటపుడు గోళ్లు తగిలి పుండ్లు పడడం వల్ల, దూడ పాలు తాగేటపుడు ఏర్పడ్డ గాయాలు పుండ్లుగా మారి సూక్ష్మజీవులు పొదుగులోకి ప్రవేశించి వ్యాధిని కలగజేస్తాయి. పొదుగుకు చిన్న గాయమైనా వ్యాధి వచ్చే అవకాశం ఉంది. మురికిగా ఉన్న చేతులతో పాలు పితికినా వ్యాధి వస్తుందని తెలిపారు.

ఇవీ లక్షణాలు...

వ్యాధి బారిన పడిన ఆవులు, గేదెల పొదుగు, సిరలు వాచిపోతాయి. ముట్టుకోగానే పశువులు బాధతో విలవిల్లాడిపోతాయి. పొదుగు గట్టిగా మారిపోతుంది. పాలు పితికినపుడు నీరులా ఉండి తక్కువ పాలను మాత్రమే ఇస్తుంది. ఒక్కోసారి పాలధారలో రక్తపు బొట్లు వస్తాయి. జ్వరం సోకడంతో మేత తగ్గిపోయి నీరసించిపోతుందని తెలిపారు.

నివారణ ఇలా..

పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వీలైనంత పొడిగా ఉండేలా చూసుకోవాలని ఏడీ సూచించారు. పశువులను శుభ్రంగా కడుగుతూ ఉండాలన్నారు. పాలు పితికేముందు గోరువెచ్చని నీళ్లతో పొదుగును కడిగి శుభ్రమైన గుడ్డతో తుడవాలని, పాలు పితికేవారి చేతులకు గోళ్లు లేకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. పొదుగులో పాలు ఉంచకుండా మొత్తం పితికేయాలని తెలిపారు. గర్భకోశ వ్యాధి ఉన్న పశువులు, ఈనిన పశువుల నుంచి కారే రక్తం, చీము, స్రవాలను పొదుగుకు తాకకుండా ఎప్పటికప్పుడు గోరు వెచ్చటి నీటితో శుభ్రపరుస్తూ ఉండాలని తెలిపారు.

వ్యాధి లక్షణాలు ఉంటే...

ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న పశువైద్యులను సంప్రదించాలి. వ్యాధి సోకిన పశువులకు యాంటిబయోటిక్ మందులతో చికిత్స చేయించాలి. నిర్లక్ష్యం చేస్తే పశువుకు వ్యాధి, రైతుకు నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు. రైతులు ఎప్పటికపుడు పశువులను పరిశీలిస్తూ కొత్తగా ఏమైనా మార్పులు కనిపించినా, వ్యాధి లక్షణాలు తెలిసినా వెంటనే చికిత్స చేయించాలని చెప్పారు. సకాలంలో వ్యాధులను గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేయడం, చికిత్స అందించడం ద్వారా రైతుకు నష్టాలు తప్పి, లాభాలు చేరతాయి.

గూటూరును పరామర్శించిన చిక్కాల



గూటూరు శ్రీనివాసరావును పరామర్శిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావును ఉత్తరాంధ్ర జిల్లాల వ్యవసాయ సలహా మండల చైర్మన్ చిక్కాల రామరావు పరామర్శించారు. శ్రీనివాసరావు అస్వస్థతకు గురై కాకినాడ ఆస్పత్రిలో వైద్యం పొందారు. పట్టణంలో గల ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. శ్రీనివాసరావును చిక్కాల రామారావు పరామర్శించి, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. రామారావుతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, కలిదిండి సతీష్‌రాజు, అనిశెట్టి వెంకటసూరి పాల్గొన్నారు.

సొసైటీకి మెరుగైన సేవలందించాలి



నరసింహమూర్తిని సత్కరిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : పదవులకు వన్నె తీసుకురావాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. పెందుర్తి పీఏసీఎస్ అధ్యక్షునిగా నియమితులైన శరగడం నరసింహమూర్తి ఆదివారం మర్యాదపూర్వకంగా ప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తిని ప్రసాద్ శాలువాతో కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు మెరుగైన సేవలందించి సొసైటీకి పేరు తీసుకురావాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడేలా పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మునగపాక ఎంపీటీసీ సూరిశెట్టి రాము, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సూరిశెట్టి కన్నారావు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సేవా రత్న అవార్డు ఎంపికైన అరుణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గోకులపాడు కళ్యాణ మండపంలో రెండో రోజు ఆదివారం కొన్ని గ్రామాల వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. సేవావజ్ర, సేవా రత్న, సేవా మిత్ర వలంటీర్లను దుస్సాలువాతో సత్కరించి, ధృవీకర పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకాల అమలులో ప్రభుత్వానికి కీలకంగా గ్రామ వలంటీర్లు మారారని, అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలకు ఏ చిన్న అవసరం వచ్చినా తాను నియోజకవర్గంలో అందుబాటులో ఉంటున్నానని, తనను కలవవచ్చని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు, తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యానారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు మల్లే లోవరాజు, కోశెట్టి వెంకటరమణ, కొరపాటి గోపాలం, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, కొరుప్రోలు ఎంపీటీసీ కేసుబోయిన వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకునాయుడు, మైలారు శ్రీనివాసరావు, సమ్మెంగి శ్రీనివాసరావు, అద్దేపల్లి బొజ్జన్న, బాబూరావు, ఉద్దడం సూర్యనారాయణ, చొప్పారాజు, వైబోయిన సత్తిబాబు, శీరం నరసింహామూర్తి పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ వర్ధంతి



నక్కపల్లిలో రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులు

నక్కపల్లి : మండల కేంద్రంలో ఆదివారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్‌పార్టీ నాయకులు మేడటి శంకర్ రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నీలి అశోక్, బత్తుల రఘు, నాగేష్, ముద్దా నాగేష్ పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి



యలమంచిలిలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

యలమంచిలి : ఐటీ విప్లవానికి నాంది పలికిన మేధావి, సాంకేతిక నైపుణ్యాన్ని కొత్త పుంతలు తొక్కించిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ అని యలమంచిలి మండలం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుందరపు ఈశ్వరరావు అన్నారు. యలమంచిలి పట్టణంలో ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32 వ వర్ధంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలసి సుందరపు ఈశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానిగా విశేష సేవలందించి, ప్రపంచ చిత్రపటంలో భారతదేశానికి గుర్తింపు తెచ్చారని అన్నారు. కార్యక్రమంలో యలమంచిలి పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాబూ.. ఇదొద్దు

- రూ.2వేల నోటుకు కూలీల తిరస్కరణ

అనకాపల్లి రూరల్: ఆర్‌బీఐ రూ.2 వేల నోట్ల చలామణి నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించిన 24 గంటల్లోనే మారుమూల గ్రామాల్లో వీటి బట్వాడా పూర్తిగా నిలిచిపోయింది. వాస్తవానికి సెప్టెంబర్ వరకూ ఒకవ్యక్తి రోజుకు రూ.20 వేల చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేసుకోవచ్చునని ఆర్‌బీఐ ప్రకటించింది. కానీ గ్రామస్థాయిలో కర్షకులు, కూలీలు, చిరుద్యోగులు రూ.2 వేల నోటు ఎవరైనా ఇస్తుంటే వద్దంటూ తిరస్కరిస్తున్నారు. తమ వద్ద పని చేస్తున్న సిబ్బంది, కూలీలు కూడా వీటిని పుచ్చుకోకపోవడంతో పలువురు యజమానులు అయోమయంలో పడ్డారు. గత కొన్ని నెలల నుంచి అలికిడి లేకుండా పోయిన రూ.2 వేల నోట్లు ఇప్పుడు ఆర్‌బీఐ ప్రకటనతో బయటికి రావడం మొదలయింది. పలు రంగాలకు చెందిన వ్యక్తుల నివాసాల్లో రూ.లక్షల్లో రూ.2 వేల నోట్లు పేరుకుపోయాయనే గుసగుసలు వినబడుతున్నాయి. భారీస్థాయిలో ఈ నోట్లను గనుక ఒకే వ్యక్తి బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే వారిపై నిఘా వుండే అవకాశం లేకపోలేదని పలువురు చెబుతున్నారు. దీంతో తమ వద్ద పని చేస్తున్న సిబ్బంది, కర్షక, కార్మికుల పేర్లతో బ్యాంకుల్లో రోజుకు రూ. 20 వేల చొప్పున రూ.2 వేల నోట్లు డిపాజిట్ చేసేందుకు యజమానులు ప్రాధేయపడుతున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



సమావేశానికి హాజరైన ఎంఈవోలు, ప్రిన్సిపాళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు అనే కార్యక్రమం ద్వారా నగదు ప్రోత్సాహంతో సత్కరిస్తున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్ ఆవరణలో జిల్లాలో గల ఎంఈవోలు, ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆదివారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 25న నియోజకవర్గస్థాయి, 27న జిల్లాస్థాయి, 31న రాష్ట్రస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి హైస్కూల్ నుంచి మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు, జిల్లాస్థాయిలో ముగ్గురు విద్యార్థులకు, రాష్ట్రస్థాయిలో ఒక విద్యార్థికి నగదు ప్రోత్సాహం అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బి.సుజాత, జిల్లాలో గల ఎంఈవోలు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

మూలపేటలో కంటి వైద్య పరీక్షలు



కళ్లజోళ్లు అందిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి రూరల్: మండలంలోని మూలపేట గ్రామంలో సోడదాసి శ్రీనివాస్ శామ్యూల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం జరిగింది. స్థానికులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో దృష్టిలోపం ఉన్న 16 మందికి ట్రస్ట్ చైర్మన్ ఎస్. శాంతి కళ్లజోళ్లు అందజేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇలాంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. సర్పంచ్ భీశెట్టి గంగా అప్పలనాయుడు, వార్డు సభ్యులు యల్లపు హైమావతి, ఆడారి సత్యనారాయణ పాల్గొన్నారు.

27, 28న యోగా సెంటర్ ప్రథమ వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న దొరమనాయుడు

అనకాపల్లిటౌన్: స్థానిక జార్జిక్లబ్ యోగా సెంటర్ ఆవరణలో ఈనెల 27, 28 తేదీల్లో యోగా ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు యోగా గురువు భీశెట్టి దొరమనాయుడు తెలిపారు. యోగా సెంటర్ ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యంగా జీవించాలంటే నిత్యం యోగా చేయాలని అన్నారు. 27న యోగాపై పట్టణంలో పురవీధుల మీదుగా అవగాహన ర్యాలీలు, 28న క్లబ్ ఆవరణలో యోగాసనాలపై పోటీల నిర్వహణ, పోటీల్లో గెలిపొందిన వారికి సాయంత్రం బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉదయం, సాయంత్రం యోగా చేయడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు పెంటకోట సుబ్రహ్మణ్యం, కొలపర్తి కన్నబాబు, భీమరశెట్టి శ్రీనివాసరావు, ఆడారి చినవీరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాయకరావుపేట : పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం వ్యాసరచన, పాఠ్యాంశాలు చదవడం, రాయడంపై విశ్రాంత అధ్యాపకుడు ఎస్.సీతారామయ్య బోధించారు. అదేవిధంగా ఎ.శ్రీనివాసరాజు విద్యార్థులకు యోగాపై వివరించారు. అనంతరం పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు, నీతి కథలు బోధించారు. భగవద్గీత, రామాయణంలోని పలు అంశాలను, శ్లోకాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

మునగపాక : వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గా ప్రసాద్ కోరారు. మునగపాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విద్యార్థులకు భారతదేశ అభివృద్ధిలో నిరోధించే అంశాలు, ఇందుకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. దేశ నాయకుల జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. గ్రంథాలయాల సందర్శన మంచి అలవాటని, పుస్తక పఠనంతో జ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయాధికారి తెలిపారు.

తిమ్మరాజుపేటలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మునగపాక : తిమ్మరాజుపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామాభ్యుదయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరానికి విశాఖకు చెందిన ఓమ్ని ఆర్కే ఆస్పత్రి వైద్యులు సేవలందించారు. 354 మంది రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఎంపీటీసీ శరగడం అప్పలనర్సమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా పేద రోగులకు మేలు జరుగుతుందన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, అంతర్జాతీయ ఐక్య సేన అధ్యక్షుడు ఉమాశంకర్, విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కెమికల్ విభాగం హెడ్ భీశెట్టి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాము, సంస్థ అధ్యక్షుడు మళ్ల స్వామి, కోశాధికారి ఆడారి పాపారావు పాల్గొన్నారు. శిబిరంలో వైద్యులు వంశీ, సాయి ప్రదీప్ సేవలందించారు.

'సేవా వజ్ర' గ్రహీతకు సత్కారం



గురువునాయుడును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రాజు

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ఎంతో ఆదర్శంగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు జామి రాజు(సింగర్‌రాజు) అన్నారు. మండలంలోని నాగులాపల్లికి చెందిన వలంటీర్ దొడ్డి గురువునాయుడు సేవా వజ్ర పురస్కారానికి ఎంపికైన నేపథ్యంలో ఆదివారం సచివాలయం ఆవరణలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్ సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు బొడ్డేడ బుజ్జి, సంతోష్ పాల్గొన్నారు.

కట్టుపాలెంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్, వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి : స్వాతంత్ర్యం వచ్చాక దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని రచించి, సరికొత్త శాసన వ్యవస్థను రూపొందించిన మహనీయుడు డా.బి.ఆర్.అంబేడ్కర్ అని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ కట్టుపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగంలో ప్రత్యేక స్థానాన్ని కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. యలమంచిలి పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆర్థిక సహాయం ద్వారా స్థానిక ప్రజలు కోరిక నెరవేరిందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే అత్యున్నత స్థాయిలో అంబేడ్కర్ స్మృతివనంను రాష్ట్ర రాజధానిలో ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నకు సీఎంగా పట్టం కట్టేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, సచివాలయ కన్వీనర్ పిల్లా గోవింద్ అయ్యలనాయుడు, నాసా డైరెక్టర్ సోని, దళిత సంఘ అధ్యక్షుడు గొంపాన అప్పారావు, పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ నాయకురాలు కనికెళ్ల అమ్మాజీ, గుర్రం అప్పారావు, రావాడ రాము పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : వెదుళ్లపాలెంలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తమలపాకు పూజలు, హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బాబూరావు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్న సమారాధనను ఏపీ పట్టణ ఆర్థిక మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ ప్రారంభించారు. అగ్రహారం, న్యాయంపూడి గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సర్పంచ్ వెదుళ్ల వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెదుళ్ల రమణ, శీరం నర్సింహమూర్తి, పాపారావు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ఎస్కలేటర్

- నెలలో నగం రోజులు పని చేయని వైనం
- పట్టించుకోని కాంట్రాక్టర్
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



రైల్వేస్టేషన్‌లో వినియోగంలో లేని ఎస్కలేటర్

అనకాపల్లిటౌన్: అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎస్కలేటర్ మొరాయించింది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. సౌత్‌సెంట్రల్ రైల్వే జోన్ పరిధిలో చిట్టచివర స్టేషన్, అనకాపల్లి జిల్లాలో ప్రధానమైన స్టేషన్‌లో ఇలాంటి సమస్య ఉన్నప్పటికీ విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు సమస్యపై దృష్టి సారించడంలేదు. స్టేషన్‌లో మూడు ఫ్లాట్‌ఫారాలు ఉన్నాయి. టిక్కెట్ బుకింగ్ ఒకటో నంబర్‌కు ఆనుకుని ఉంది. రెండు, మూడు ఫ్లాట్‌ఫారాలకు వృద్ధులు, చిన్నారులు చేరుకునేలోపు రైలు కదిలిపోయే సందర్భాలు ఉన్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఎస్కలేటర్ ఆపరేటింగ్‌ను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ప్రయాణికుల సమస్యపై రైల్వే ఉన్నత స్థాయి అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.